క్లుప్తంగా

ఉపాధ్యాయుల సేవలు ఆదర్శనీయం: ఎంఈఓ

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని వాడి ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా నిలిచాయని ఎంఈఓ మధుమోహన్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆ ఉపాధ్యాయులు సుభాశ్‌రెడ్డి, రాందాస్, మీనాలను సన్మానించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించారని కొనియాడారు. కార్యక్రమంలో మెదక్ ఎంఈవో నీలకంఠం, సంతోశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్



నియామక పత్రం అందుకుంటున్న శ్రీకాంత్

హవేళిఘణాపూర్(మెదక్): బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా హవేళీఘణాపూర్ మాజీ ఎంపీటీసీ నోముల శ్రీకాంత్ ఎన్నికయ్యాడు. ఈ మేరకు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ గురువారం నియామక పత్రాన్ని శ్రీకాంత్‌కు అందజేశారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సైబర్ మోసగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకోవద్దని పోలీసులు అన్నారు. గురువారం వారు మండలం బద్రియా తండాలో రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు ఎవ్వరికీ చెప్పకూడదన్నారు. బ్యాంకు సంబంధిత వివరాల కోసం ఎలాంటి ఫోన్‌కాల్స్ రావన్నారు. రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా యువత మత్తుకు, మద్యానికి బానిస కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సాదయ్య, సతీష్, దుర్గాప్రసాద్, తండావాసులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో జాతీయ వారోత్సవాలు



వారోత్సవాల్లో అధ్యాపకులు, విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ విష్ణు ఫార్మసీ కళాశాలలో గురువారం జాతీయ ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ విద్యార్థుల ఎక్స్ఛేంజ్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్, హెచ్‌ఓడీ రాజశేఖర్, అధ్యాపకులు ఫహీం మొద్దీన్, గాయత్రి, నవీన్ తదితరులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: లక్ష్మి

రేగోడ్(మెదక్): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 62 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడబిడ్డలకు ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి పథకం వరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, మాజీ జెడ్పీటీసీలు యాదగిరి, రాజేందర్ పాటిల్, పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, వట్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీధర్ గుప్తా, కోఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా, నాయకులు రాధకిషన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ: మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంకిష్టయ్య మాట్లాడారు. చేపల వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నారాయణ, మల్లేశం, స్వరూప, బీసీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల శ్రేయస్సుకు కృషి

రామాయంపేట(మెదక్): మత్స్యకారుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు విజ్ఞప్తి చేశారు. గురువారం రామాయంపేటలో మత్స్యకారుల సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ముదిరాజ్‌లకు రావాల్సిన సబ్సిడీలు, రాయితీలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిద్ధరాంలు, ఉపాధ్యక్షుడు నరేశ్, కోశాధికారి రవి, డైరెక్టర్లు గణేశ్, పోచయ్య, కిషన్, భాగయ్య, సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తండ్లాట

ఖాళీ బిందెలతో గిరిజనుల ధర్నా



బద్రియా తండా గేటు వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న తండావాసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న తండావాసులు మెదక్ - జోగిపేట ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సంఘటన మండలంలోని బద్రియా తండా గేటు వద్ద జరిగింది. దీంతో ట్రాఫిక్‌కు సుమారు గంట సమయం అంతరాయం కలిగింది. బద్రియా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బంజారానగర్ తండాలో సుమారు వంద గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. మూడు నెలలుగా తండాకు సక్రమంగా తాగునీటి సరఫరా లేకపోవడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తండాలో నీటి సరఫరా ఒక రోజు వస్తే, నాలుగు రోజులు రావు. ఈ విషయాన్ని తండావాసులు గ్రామ కార్యదర్శికి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదు. తండాలో తాగునీటి సరఫరా చేసే బోరు మోటార్ ఎన్నిసార్లు పాడైపోయినా.. దానినే మరమ్మతు చేయించారే.. తప్ప కొత్త మోటార్ బిగించడం లేదు. దీంతో తండావాసులు ధర్నా చేశారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి వచ్చి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు, ఆయన సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

కబ్జా నుంచి కుంటను కాపాడండి



కొత్తపల్లి సాలెవాని కుంటను కాపాడాలని కోరుతున్న గ్రామస్తులు

కొత్తపల్లి గ్రామస్తుల వినతి



శిఖంభూమిలో బోరువేస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): కుంట శిఖంభూమిని అక్రమార్కుల నుంచి కాపాడాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. గురువారం మండలంలోని సలాబత్‌పూర్ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ.. కొత్తపల్లి గ్రామ సమీపంలో సాలెవానికుంట 23 ఎకరాల శిఖం ఉందన్నారు. కాగా పలువురు సమీప తండావాసులు శిఖంభూమిని కబ్జా చేస్తూ బోర్లు వేస్తున్నారని తెలిపారు. గురువారం తండాకు చెందిన రైతు శిఖం భూమిలో బోరువేస్తుండగా, గ్రామస్తులు, రైతులు అడ్డుకున్నట్లు చెప్పారు. అక్రమార్కులు శిఖం భూమి కబ్జా చేసి అక్రమంగా సాగు చేస్తున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి కుంట శిఖం కబ్జా కాకుండా, సర్వేచేసి హద్దులు వేసి కాపాడాలని కోరారు. శిఖం భూమి కబ్జా అవుతుండటంతో కుంటలో నీళ్లు తగ్గి, భూగర్భ జలాలు అభివృద్ధి చెందడం లేదన్నారు. అధికారులు స్పందించి సాలెవాని కుంట కబ్జా కాకుండా కాపాడాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన నర్సింలు, సుదర్శన్, అనీల్, శ్రీనివాస్, కృష్ణ, నాగరాజు, విఠల్, పెంటయ్య, యాదగిరి, రమేశ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఆవరణలోనే చెత్తాచెదారం

అధికారుల పర్యవేక్షణ లోపంతో పట్టించుకోని సిబ్బంది



బూర్గుపల్లి పంచాయతీ ఆవరణలో చెత్త

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ బూర్గుపల్లి ఆవరణ చెత్తాచెదారంతో నిండిపోయింది. పంచాయతీ పక్కన ఉన్న డ్వాక్రా మహిళా సంఘం కోసం కేటాయించిన గది పక్కనే పంచాయతీ సిబ్బంది చెత్త వేస్తున్నారు. ఊరంతా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన పంచాయతీ అధికారులే ఇలా చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పంచాయతీ ఆవరణలోనే చెత్తను పారవేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని పరిశుభ్రత పాటించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలులో మోసం

- బస్తాకు అదనంగా 3 కిలోలు తూకం వేస్తున్న వైనం
- అధికారులకు రైతుల ఫిర్యాదు



రెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన

అల్లాదుర్గం(మెదక్): కొనుగోలు కేంద్రాల్లోని కొందరు నిర్వాహకులు రైతులను నట్టేట ముంచుతున్నారు. తూకంలో మోసం చేస్తూ బస్తాకు ఏకంగా 3 కిలోల ధాన్యాన్ని అదనంగా నింపుతున్న విషయాన్ని బాధిత రైతులు బట్టబయలు చేసిన సంఘటన గురువారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. రైతుల కథనం ప్రకారం.. మండలంలోని రెడ్డిపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రంలోని నిర్వాహకులు రైసుమిల్లుకు తరలించిన ధాన్యంలో 7 బస్తాల ధాన్యం కొరత ఏర్పడిందని మిల్లు యజమానులు చెప్పారు. దీంతో రైతులకు అనుమానం రావడంతో గురువారం ఈ కొనుగోలు కేంద్రంలోని తూకంపై రైతులు నిఘా పెట్టారు. అనంతరం తూకం వేసిన ఈ బస్తాలో 42 కిలోల 300 గ్రాములు ఉండాల్సిన ధాన్యం.. 44 కిలోల నుంచి 46 కిలోలు ఉండటంతో రైతులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క బస్తాకు 3 నుంచి 4 కిలోల ధాన్యంలో దగా చేస్తే.. ఇంకేమి మిగులుతుందని వారు కొనుగోలు కేంద్రంలో తూకాలను నిలిపివేసి ఆందోళన చేశారు. ఈ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మోసంపై జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళా ప్రదర్శన



జక్కపల్లిలో కళాకారుల బృందం ప్రదర్శన

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్‌తో పాటు మండలంలోని జక్కపల్లి, బ్రాహ్మణపల్లిలో గురువారం సాంస్కృతి సారధి బృందం సభ్యులు ప్రజాపాలన విజయోత్సవాలపై ఆటపాటలతో కళా ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నందున కలెక్టర్ ఆదేశాలతో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై పాటల రూపంలో వినిపించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి సారధి టీం లీడర్ సిద్ధులు ఇతర బృందం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొల్చారం(నర్సాపూర్): మన కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ సందర్శించారు. ఎస్పీ ఆదేశాలతో కేంద్రాలను పరిశీలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ధాన్యం రవాణా సజావుగా సాగేలా లోడింగ్ అన్‌లోడింగ్ త్వరగా జరిగేలా చేపట్టాలని రైస్ మిల్లర్లను, కొనుగోలు కేంద్రాల సిబ్బందిని కోరారు.

సభ్యత్వం కల్పించండి

నర్సాపూర్ రూరల్: మత్స్యకారులకు చట్ట భద్రత కల్పించాలని నర్సాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దిగంబరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ మత్స్యకారుడికి సభ్యత్వం ఇవ్వడంతో పాటు చట్ట భద్రత కల్పించాలన్నారు. చేప పిల్లల కోసం సొసైటీలకు నగదు బదిలీ చేయడంతో పాటు 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు, వలలు, ఐస్ బాక్సులు, మార్కెటింగ్ సౌకర్యం ఉచితంగా కల్పించాలని తెలిపారు.

వైభవంగా శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠ

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని 13వ వార్డు ద్వారకా నగర్ కాలనీలో ఆంజనేయ స్వామి సహిత శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, లావణ్యరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



చిన్న చింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): ధాన్యం తరలింపులో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని తహసీల్దార్ గ్రేస్‌బాయి గురువారం సూచించారు. మిల్లులో తహసీల్దార్ ధాన్యం అన్‌లోడింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గ్రేస్‌బాయి తదితరులు ఉన్నారు.

ఇబ్బందులుంటే చెప్పండి

నర్సాపూర్ రూరల్: కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేయాలని నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని చింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు సజావుగా సాగేందుకు పూర్తిగా సహకరిస్తామని నిర్వాహకులకు, రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సిద్దీరాంరెడ్డి, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, సీసీ ప్రవీణ, సీఏ లక్ష్మి, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంచి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): రబీ సాగులో రైతులు భూమికి అనుకూలమైన వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో తునికి కృషి విజ్ఞాన కేంద్రం, మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు స్నేహ, శిరీష, శైలజ, సింధు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రబీలో వేసే పంటలు, విత్తనాల ఎంపిక గురించి వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ పంటలో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు భిక్షపతి, ఆంజనేయులు, చంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు



నిజాంపేట(మెదక్): బహుమతులు అందిస్తున్న ఏంఈఓ యాదగిరి



శివ్వంపేట(నర్సాపూర్): బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. 14 పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రఘుపతి, నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్ ఉపాధ్యాయులు వెంకటేశ్, మనోహర్, నర్సింహరావు, శ్రీదేవి, సంధ్యారాణి, శ్రీవాణి పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

వెల్దుర్తి(తూప్రాన్): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండల స్థాయిలో ఇంగ్లీష్ మీడియం నుంచి వెల్దుర్తి, ఇంగ్లీష్ మీడియంలో మంగళపర్తి విద్యార్థులు ప్రథమస్థానం సాధించారు. దీంతో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వెల్దుర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాంబయ్య, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

శివ్వంపేట(నర్సాపూర్): ఉన్నత విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలచంద్రం, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సత్యం విద్యా మందిర్ ప్రిన్సిపాల్ మహేందర్‌ఉన్నారు.

సైన్స్ సంబరాలు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైన్స్ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతి మండల విద్యాధికారి సొంగని యాదగిరి అందజేశారు. కార్యక్రమంలో నిజాంపేట ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మహేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆయా పాఠశాలల విద్యార్థులకు ఎంఈఓ విఠల్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేదశ్రీ, రమేశ్, అజయ్ కుమార్, నాగభూషణం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం(మెదక్): విద్యార్థులు మూఢనమ్మకాలు నమ్మొద్దని సీఐ రేణుకారెడ్డి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ అన్నారు. ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం వ్యక్తిత్వ వికాసం - సైన్స్ - మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నరేశ్ మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం సభ్యులు శ్రీలత, సౌమ్య, స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

సంక్షిప్త వార్తలు

◆ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం ఖాజాపూర్ గ్రామానికి చెందిన సాయిని యాదమ్మ ఇంటికి తాళం పెట్టి పనికి వెళ్లారు. ఇదే సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. 2 క్వింటాళ్ల బియ్యం, నగదు, ఆధార్‌కార్డులు, కుమారుడి స్టడీ సర్టిఫికెట్లు, దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయని బాధితురాలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ మన్నన్, ఆర్‌ఐ రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

◆ కానిస్టేబుల్‌గా బాధ్యతల స్వీకరణ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటకు చెందిన యువకుడు కానిస్టేబుల్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించాడు. గ్రామానికి చెందిన మహ్మద్ రియజొద్దీన్ పోలీస్ నియామకాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికై మెదక్ ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా బాధ్యతలు స్వీకరించాడు.

◆ దివ్యాంగుల రిలే దీక్షలు

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంజీవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం దివ్యాంగులు మెదక్ సమీకృత కలెక్టరేట్ సమీపంలో రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్, కోశాధికారి భూమయ్య, మహిళా అధ్యక్షురాలు గంగ, కృష్ణ, సుధాకర్, స్వామి గౌడ్ , రెడ్యానాయక్, మాణిక్యం, శీను, ఎల్లం, దివ్యాంగులు పాల్గొన్నారు.

◆ చేయూత

మనోహరాబాద్(తూప్రాన్): తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తించి మరణించిన ఉద్యోగి కుటుంబసభ్యులకు తోటి ఉద్యోగులు నగదును గురువారం అందిజేశారు. తహసీల్దార్ కార్యాయలంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తూ హార్ట్ అటాక్‌తో మృతి చెందిన సురేశ్ కుటుంబ సభ్యులకు కార్యాలయ సిబ్బంది కలిసి రూ. 56 వేల నగదును తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ దీక్షిత్, సిబ్బంది తదితరులున్నారు.

◆ ఎన్నిక నిర్వహించండి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి సహకార సంఘం చైర్మన్ ఎన్నికను నిర్వహించాలని సంఘం డైరెక్టర్ నర్సింహచారి కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. ఆరు నెలల్లో చైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సిన అధికారులు అందుకు అవసరమైన నోటిఫికేషన్ జారీచేయలేదన్నారు. దీంతో సొసైటీ డైరెక్టర్లతో సంతకాలు చేసి కలెక్టర్, డీసీఓలకు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

◆ 24న సామూహిక వ్రతాలు

పెద్దశంకరంపేట(మెదక్): సంగారెడ్డిలో ఈ నెల 24న బ్రాహ్మణ సమాజం–సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక సత్యనారాయణ వ్రతాలను విజయవంతం చేయాలని మండల సంఘం అధ్యక్షుడు రామచంద్రాచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆహ్వాన పత్రాలను బ్రాహ్మణ సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశ్వరరావు, సంతోష్‌శర్మ, మహిళా అధ్యక్షురాలు వాసుకి, గిరిధర్‌శర్మ, గిరిపాటిల్, కిరణ్మయి, శ్రీవిద్య తదితరులున్నారు.

◆ విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన

మెదక్ మున్సిపాలిటీ: రాజ్యాంగ దినోత్సవాన్ని ఈనెల 26న నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని గీతా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షులు శివకుమార్, విద్యార్థి నాయకులు కిరణ్, సురేశ్, మహేందర్, నరేశ్, నాగరాజు, కృష్ణ, ఉపేందర్, నరేశ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ 23, 24న ఓటరు నమోదుపై స్పెషల్‌డ్రైవ్

పెద్దశంకరంపేట(మెదక్): ఓటరు నమోదుపై ఈ నెల 23, 24 తేదీల్లో మండలంలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు తహసీల్దార్ గ్రేస్‌బాయి గురువారం తెలిపారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 18 ఏళ్లు నిండిన వారు తమ పేర్లను బీఎల్‌ఓల వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): చికిత్స పొందుతూ వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన కొర్పోల్ కృష్ణ(24) ఈనెల 19న గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తూప్రాన్: పట్టణంలోని అంబేడ్కర్, జాగ్జీవన్ రామ్‌ల విగ్రహాల వద్ద మాలల మహా పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను సంఘం అధ్యక్షుడు నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వెంకటేష్, సత్య లింగం, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, నాయకులున్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన పెద్దశంకరంపేట శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన పల్లెబోయిన కృష్ణ(40) తన బైక్‌పై శివాయిపల్లికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే చనిపోయినట్లు తెలుస్తోంది. కృష్ణ మేస్త్రీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, ప్రమాదానికి కారణమైన వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ కరెంట్ వైర్లు తగిలి హార్వెస్టర్ దగ్ధం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల దుర్గయ్య హార్వెస్టర్ విద్యుత్‌వైర్లు తగలడంతో దగ్ధమైంది. కాగా డ్రైవర్, క్లీనర్‌తోపాటు మరో రైతుకు ప్రమాదం తప్పగా.. రూ 3లక్షలకుపైగా నష్టం జరిగింది. ఈ సంఘటన గురువారం మండలంలోని ముత్రాజ్‌పల్లిలో చోటుచేసుకుంది. ప్రభుత్వ తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

◆ ముమ్మరంగా ఇంటింటి సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముమ్మరంగా జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల తెలిపారు. గురువారం మండలంలోని కంచన్‌పల్లి, పాంపల్లి, ధర్మాసాగర్ తదితర గ్రామాల్లో సర్వేను పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు.